www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 17 జనవరి 2023 5 తూర్పుగోదావరి

రూ.10వేలు పలికిన కోస మాంసం

ప్రజాశక్తి - రాజానగరం

సంక్రాంతి సమయంలో కోస మాంసాన్ని ఉన్న గిరాకీయే వేరు. కనుము, ముక్కనుమ రోజుల్లో కోస మాంసంతో ఇంటికి వచ్చిన అతిథులుకు, అల్లుళ్లకు విందు పెట్టడం ఇక్కడ అనవాయితీ. దీని కోసం ఎంత మొత్తాన్ని అయినా వెచ్చించేందుకు సిద్ధపడుతుంటారు. ఈ ఏడాది కోస మాంసం రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ పలికింది. పందెంలో ఓడిన కోళ్లను కోసగా పిలుస్తారు. జీడిపప్పు, బాదం, కోడిగుడ్డు, గంట్లు, చోడ్లు తదితర వాటితో పందెం కోళ్లను పెంచుతారు. దీంతో అవి బలంగా, అత్యంత రుచిగా ఉంటాయి. దీంతో కోసకు డిమాండ్ ఎక్కువ. పందెం బరుల వద్దే వీటిని విక్రయిస్తుంటారు. పందెం చూసేవారు కొందరైతే ప్రత్యేకంగా కోస మాంసం కోసం వచ్చేవారే ఎక్కువగా ఉంటారు.

కోడిదే పైచేయి

పోలీసుల ఆదేశాలు బేఖాతర్

హోం మంత్రి ఇలాఖాలోనూ యథేచ్ఛగా జూదాలు

రూ.100 కోట్ల వరకూ చేతులు మారిన నగదు?

కోడి కత్తి తెగి ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మళ్లీ అదే కథ. ఈ ఏడాదీ పండుగ సమయంలో కోడే పైచేయి సాధించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో పందెం కోళ్లు కాళ్లు దువ్వాయి. కోడి పందేలకు అనుమతులు ఇవ్వబోమన్న అధికారులు సంక్రాంతి రోజు నుంచి చేతులేత్తేశారు. దీంతో కోడిపందేలు, గుండాట, పేకాట శిబిరాలు ఎక్కడికక్కడ దర్శనమిచ్చాయి. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ 15 నుంచి 20 బరులు వరకు ఏర్పాటయ్యాయి. కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, గోపాలపురం, బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీల్లో పెద్ద బరులు తొలి రోజే ప్రారంభమయ్యాయి. హోం మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్నకొవ్వూరు నియోజక వర్గంలోని నందమూరు రోడ్డులో భారీ బరి ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. జూదరులకు అక్కడ అన్ని వసతులూ కల్పించారు. మొత్తం మీద పండుగ చాటున జిల్లా వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి.

జిల్లాలో పోలీసు అధికారులు కోడిపందేలు, జూదాలకు అనుమతులు జారీ చేయకుండా కట్టుదిట్టం చేశారు. ఇన్‌ఛార్జి ఎస్‌పి సుధీర్ కుమార్‌రెడ్డి సంక్రాంతి సంబరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వబోమంటూ తేల్చిచెప్పిన విషయం విధితమే. దీంతో జూదరులు నిరాశచెందారు. భోగి పండుగ రోజున అక్కడక్కడా మాత్రమే బరులు కనిపించాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్వాహకులను, జూదరులను పోలీసులు అదుపులోకి తీసకున్నారు. దీంతో అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధుల బాటపట్టారు. హోం మంత్రి సారథ్యం వహిస్తున్న కొవ్వూరులో జూదరులు మరో అడుగు ముందుకు రెండు గ్రూపులుగా చీలిపోయి ఘర్షణలకు సైతం పాల్పడినట్లు సమాచారం. దీంతో హోం మంత్రి రంగంలోకి దిగి అనుమతులు ఇప్పించినట్లు వార్తలు విన్పిస్తున్నాయి. కేవలం కోడి పందేలకు మాత్రమే అని చెప్పినప్పటికీ గుండాట, పేకాట వంటి జూదాలకు కూడా తెరలేపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 100 బరులు ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాల్లో రూ.90 కోట్ల నుంచి రూ120 కోట్ల వరకూ చేతులు మారినట్టు అంచనా. ఎక్కువ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన వారికి కొన్ని చోట్ల కార్లు, మోటార్ సైకిళ్లు, బంగారం బహుమతులుగా ఇచ్చారు. జిల్లాలో కోడి పందేలను తిలకించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఒడిశా, చత్తీస్‌గడ్ వంటి ప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

చాగల్లు : భోగినాడు మందకొడిగా ఉన్న కోడిపందేలు, గుండాటలు సంక్రాంతి రోజున ఒక్కసారిగా పెరిగాయి. ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో అధికారులు తలొగ్గారు. మండలంలోని ఆరు చోట్ల కోడిపందేల బరుల నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో గుండాటలు కూడా ఎక్కువగా జరిగాయి.

తాళ్లపూడి : భోగి పండుగ నాడు ప్రారంభమైన కోడిపందేలు ఆది, సోమ వారాల్లోనూ సాగాయి. ఫ్లడ్ లైట్ల కాంతిలో రాత్రివేళ కూడా కొనసాగాయి. మొదటిరోజు గుండాటలకు అనుమతి ఇవ్వని అధికారులు సంక్రాంతి రోజున అంగీకరించడంతో జూదరులు పోటెత్తారు.

తాళ్లపూడిలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్న కోడిపందేలు

బిక్కవోలు మండలం కొమరిపాలెంలో గుండాట శిబిరం

కోడికత్తి తెగి వ్యక్తి మృతి

నల్లజర్ల, పెరవలి : మండలంలోని అనంతపల్లి గ్రామంలోని పామాయిల్ తోటలో నిర్వహించిన కోడిపందేల్లో కోడికత్తి తెగి యువకుడు మృతి చెందాడు. ఈ నెల 15న గ్రామానికి చెందిన పిరిగిన పద్మారావు(19) కోడిపందేలు చూసేందుకు వెళ్లాడు.కోడిపుంజు ఎగిరిన సందర్భంలో కోడికి కట్టిన కత్తి పద్మారావు కాలికి తగిలింది. నరం తెగడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే నల్లజర్ల ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పద్మారావు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో టి.నరసింహారావు కాలికి కోడి కత్తి తీవ్రగాయమైంది. వెంటనే అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

విలేకరిపై ఎంపిపి భర్త దురుసు ప్రవర్తన

బిక్కవోలు మండలంలో భారీగా కోడిపందేలు నిర్వహించారు. కొమరిపాలెం గ్రామంలో కోడిపందాల ముసుగులో గుండాటను సైతం పెద్ద ఎత్తున నిర్వహించారు. వార్తా సేకరణకు వెళ్లిన ప్రజాశక్తి దినపత్రిక విలేకరి కె.వెంకటరెడ్డిపై బిక్కవోలు ఎంపిపి కొవ్వూరి జ్యోతిర్మయిశేషుకుమారి భర్త, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి దురుసుగా ప్రవర్తించారు. పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడారు. 'నువ్వు ఒక్క క్షణం ఇక్కడ ఉంటే ఏం చేస్తానో నాకే తెలియదు' అంటూ బెదిరించారు. తన అనుచరులతో దాడి చేయించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండించారు.

కార్మికులకు ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

తక్షణమే కార్మికులతో చర్చలు జరపాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రపేపర్‌మిల్లు యాజమాన్యం తక్షణమే కార్మికులతో చర్చలు జరపాలని, ఎన్నికలు నిర్వహించి, వేతన ఒప్పందం అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ అన్నారు. రాజమహేంద్రవరంలోని పేపరు మిల్లు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, రంపచోడవరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ సందర్శించారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా, వేతన ఒప్పందం చేయకుండా పేపర్మిల్ యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటుందని విమర్శించారు. మరోపక్క కార్మికులకు టిఫిన్, భోజనంపై ఇస్తున్న రాయితీని తగ్గించి క్యాంటీన్ ధరలు పెంచిందన్నారు. కార్మికులకు న్యాయంగా ఇవ్వాల్సిన అలవెన్సులు సైతం ఇవ్వకపోవడం దారుణమన్నారు. యాజమాన్యం, గుర్తింపు సంఘం నాయకుడని చెప్పుకుని తిరిగే వ్యక్తితో కలిసి పరంపర 2 పేరుతో సీనియర్ కాంట్రాక్ట్ కార్మికులను పక్కనపెట్టి బయటి వ్యక్తులకు ఉద్యోగాలు అమ్ముకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి నిరంకుసంగా వ్యాహరిస్తున్న యాజమాన్యం తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కార్మిక సంఘాల తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు,పేపర్‌మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

చాగల్లు పశు వైద్యశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు పశువైద్యశాలను జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సత్య గోవింద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడిరైతులకు అందజేస్తున్న మందులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పాడి రైతలతో మాట్లాడారు. వైద్యశాలలో అందజేస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోని అధిక పాల దిగుబడి పొందాలన్నారు. ఆయన వెంట పశు వైద్యాధికారి డాక్టర్ యు.ముఖేష్, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఎల్ తలారి తదితరులు

క్రీడలతో బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - గోపాలపురం

క్రీడల ద్వారా యువతకు దేహ దారుఢ్యంతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు జరిగాయి. 12 రోజులు పాటు 32 జట్లతో జరిగిన ఈ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ప్రవీణ్ పాంథర్స్ జట్టు విజేతగా నిలిచి, ట్రోఫీని, రూ.1.50 లక్షల నగదు పురస్కారానిఇన కైవసం చేసుకుంది. దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన ఫ్లయింగ్ లెవెన్ జట్టు రన్నర్స్‌గా నిలిచి రూ.70వేల నగదును అందుకుంది. మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30వేల నగదు బహుమతి పొందింది. వీటిని ఎంఎల్‌ఎ తలారి చేతుల మీదుగా అందించారు. ముగ్గుల పోటీల్లో స్వాతి టీం వేసిన ముగ్గుకు మొదటి బహుమతి దక్కింది. ఒక కాసు బంగారాన్ని గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ప్రతినిధి మధుకృష్ణ, సిఐ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.రామకృష్ణ నిర్వాహకులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, కె.శేఖర్, కె.రాజా, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వందే భారత్' సరికొత్త సంచలనం

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వందే భారత్ రైలు భారతీయ రైల్వేలో సరికొత్త సంచలనమని ఎంపీ మార్గని భరత్‌రామ్ అన్నారు. విశాఖ నుంచి సికింద్రాబాదుకు 'వందే భారత్' హై స్పీడు బుల్లెట్ రైలు సేవలు అందించిన ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ నుంచి విశాఖకు 'వందే భారత్' రైలు ప్రారంభమైంది. తొలిసారిగా రాజమహేంద్రవరం రైల్వే స్టేషనుకు రావడంతో మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ భరత్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తదితరులు బుల్లెట్ రైలును ఆసక్తిగా తిలకించారు. ట్రైన్ ఎక్కి బోగీలను, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. కొద్ది సేపు చైర్ కార్‌లో కూర్చొని రైల్వే అధికారులతో ముచ్చటించారు. అనంతరం విశాఖపట్నం వైపు వెళుతున్న 'వందే భారత్' బుల్లెట్ ట్రైన్‌కు వారు జెండా ఊపి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడారు. 2023 కొత్త సంవత్సరం ఆరంభంలో ప్రారంభించిన ఈ బుల్లెట్ రైలు రైల్వే శాఖకు ఒక సంచలనం, సరికొత్త రికార్డు తీసుకు రాగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కాలంతో పాటు పరుగులు తీస్తున్న ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు ఇటువంటి రైళ్లు మరిన్ని రావాలన్నారు. వర్తక, వాణిజ్య రంగాలలో వారే కాకుండా చాలామంది విమాన ప్రయాణాలపైనే ఆసక్తి చూపిస్తున్నారని, చాలా త్వరగా గమ్యానికి చేరుకోవాలనే ఆలోచనతో సంపన్నులు రైలు ప్రయాణం కంటే విమానయానానికే ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో 'వందే భారత్' బుల్లెట్ ట్రైన్ రైల్వే శాఖకు ఒక సువర్ణాధ్యాయనమే అన్నారు. ఉత్తర కాశీ నుంచి దక్షిణ కాశీ(రాజమహేంద్రవరం)కి కూడా ఇటువంటి వేగవంతమైన రైలు అవసరమన్నారు. కొవ్వూరు-భద్రాచలానికి కొత్త రైలు అవసరం ఉందన్నారు. అలాగే కోస్తా ప్రాంతంలో పలు కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు వేయాల్సిన అవసరాన్ని ఎంపీ భరత్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వందేభారత్ రైలుతో కార్‌చైర్‌లో కూర్చొన్న ఎంపీ భరత్, కలెక్టర్ మాధవీలత

ఘనంగా మాయావతి పుట్టినరోజు

ప్రజాశక్తి - పెరవలి

బిఎస్‌పి అధినేత, ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎంపీ మాయావతి పుట్టిన రోజును పెరవలిలోని బిఎస్‌పి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బిఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిర్రా రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ దేశంలో అట్టడుగు వర్గాలైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల రాజ్యాధికారం కోసం మాయావతి కృషి చేస్తున్నారన్నారు. దేశంలో భారత రాజ్యాంగం సుభిక్షంగా ఉండాలన్నా పూర్తి స్థాయిలో అమలు కావాలన్నా బిఎస్‌పిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. బిజెపి, వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్నారు. దీన్ని కాపాడాలంటే బిఎస్‌పికి ఓటు వేయాలన్నారు. ఈ నెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'బహుజన రాజ్యాధికార యాత్ర' ప్రారంభం కాబోతుందన్నారు. ఈ యాత్ర ఫిబ్రవరి 3న నిడదవోలు చేరుకుంటుందన్నారు. అనంతరం నిడదవోలులో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెన్నపు సుధాకర్, బయ్యే మునేంద్ర, మర్రి మహాలక్షముడు, బి.జాన్, డి.జాషువా, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

మాయవతి జయంతిలో పాల్గొన్న బిఎస్‌పి నాయకులు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

సిబ్బంది నిర్లక్ష్యమే కారణం అంటున్న బంధువులు

ప్రజాశక్తి- గోపాలపురం

పురుగు ముందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. వైద్యసిబ్బంది సకాలంలో వైద్యం అందించకపోవడం వల్లే మృతి చెందాడని బంధువులు, తోటి స్నేహితులు చెబుతన్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. మతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం పెద్దగూడెం గ్రామానికి చెందిన తానేటి బ్రహ్మయ్య(40) మనస్థాపంతో ఆదివారం సాయంత్రం పురుగుమందు తాగాడు. గమనించిన బ్రహ్మయ్య సోదరుని కుమారులు వెంటనే గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తీసుకువెళ్లారు. వైద్య సిబ్బంది స్పందించలేదు. వైద్యం అందించాలని బంధువులు ప్రాధేయపడినా కనికరం చూపలేదు. వైద్యులు రాకపోవడంతో బ్రహ్మయ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మతదేహం వద్దకు వచ్చి వైద్య సిబ్బంది వివరాలు రాసుకున్నారే తప్ప వైద్యం అందించలేదని వారు కన్నీరుమున్నీరయ్యారు. వెద్యాధికారుల నిర్లక్ష్యం వల్లే బ్రహ్మయ్య ప్రాణాలు కోల్పోయాడని వారు ఆరోపించారు. బ్రహ్మయ్య కూలి పనులు చేస్తు తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెంలో జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుతులు అందించారు. ముఖ్యఅతిగా మండల అధ్యక్షులు ఐ.పల్లారావు పాల్గొని బహుమతులు అందించారు. మొదటి బహుమతిగా డ్రెస్సింగ్ టేబుల్, రెండో బహుమతిగా రెండు కరెంట్ కుక్కర్లు, మూడో బహుమతిగా మిక్సీలు, ప్రత్యేక బహుమతిగా సీలింగ్ ఫ్యాన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు , వార్డు మెంబర్ కారింకి బాబి, ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ డి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మ తీర్థం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని దుళ్లలో చింతాలమ్మ తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. పేరుకు కడియం మండలం దుళ్ల అయినప్పటికీ మండపేట మండలం ఏడిది గ్రామ పరిధిలో ఈ అమ్మవారి ఆలయం ఉంటుంది. కడియం, మండపేట, ఆలమూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కనుమ రోజున జరిగే ఈ అమ్మవారి తీర్థానికి పెద్ద ఎత్తున తరలివస్తారు. రోడ్లు, రవాణా సదుపాయం అంతగా లేని రోజుల్లో ఆలమూరు, కడియం మండలాల లంక గ్రామాల ప్రజలు, రైతులు, సైకిళ్లు, ఎడ్లబండ్లపై మండపేట పట్టణానికి రాకపోకలు సాగించేవారు. ఈ రోడ్డు మార్గం మధ్యలో ఉండే చింతాలమ్మవారిని దర్శించుకుని ప్రయాణం సాగించేవారు. సంక్రాంతి పండుగకు సొంతూరు వచ్చే వారంతా విధిగా ఈ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

గ్రామ దేవతలకు మకర తోరణం సమర్పణ

ప్రజాశక్తి - కడియం

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపిపి విజయ దంపతులు పుంతలో ముసలమ్మ, సోమాలమ్మ అమ్మవార్లలకు మకరతోరణం సమర్పించారు. మాధరాయుడుపాలెం గ్రామస్తులు గ్రామ దేవతగా కొలిచే అమ్మవార్లకు నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయానికి శాశ్వత ఆదాయం ఉండేలా రూ.3లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ నిర్వహణ కొనసాగాలనే ఉద్దేశంతో చంటి వాటిని ఏర్పాటు చేశారు.

మకరతోరణం అందిస్తున్న సర్పంచ్ దంపతులు

కార్టూ'నిజం'



18 నుంచి సిపిఐ పోరుబాట

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అందించాలని కోరుతూ ఈనెల 18 నుంచి సిపిఐ పోరుబాట నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. సందర్భంగా గోడపత్రికను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం హర్షణీయమన్నారు. అయితే ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సరిపోవన్నారు. దీన్ని రూ.5లక్షల వరకూ పెంచాలన్నారు. తెలంగాణ, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో ఈ మొత్తం ఎక్కువగా ఉందన్నారు. అదే తరహాలో ఇక్కడ కూడా లబ్ధిదారులకు సాయాన్ని పెంచాలన్నారు. ఈ మేరకు సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 30 వరకు పోరుబాట నిర్వహిస్తుందన్నారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ చేస్తుందన్నారు. జనవరి 30న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. దీన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షులు కోండ్రపు రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సిపిఐ నగర సహాయ కార్యదర్శి రమణ, కార్యవర్గ సభ్యులు రమణమ్మ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోగులమ్మ జాతరకు ఘనంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో గ్రామదేవత గోగులమ్మ జాతరకు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణలు, అమ్మవారి భారీ కటౌట్లు, గ్రామ నలుదిక్కుల ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు ప్రజలను, భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం రాత్రి. ఆశాదుల, భేతాళ నత్యాలు, వివిధ వేషధారణలు, పలు సాంస్కతిక కార్యక్రమాలతో అమ్మవారి జాతర నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం అమ్మవారికి పొన్పులు, నైవేధ్యాలు, అమ్మవారిని గుడికి సాగనంపే కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13 ఏళ్ల తరువాత వైభవంగా చేపట్టనున్న జాతరను విజయవంతం చేయాలని గ్రామస్తులకు నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పెరవలి

మండలం ముక్కామలలో రామకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో వేంద్ర వారి వీధిలో సంక్రాంతి ముగ్గులు పోటీలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన పిల్లలందరూ ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. 70 ఏళ్ల భామ్మ ధనలక్ష్మి కూడా ముగ్గుల పోటీల్లో పాల్గొని అందర్నీ ఆశ్చర్యపరిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేంద్ర చౌదరి, సెక్రటరీ కుక్కల నాగరాజు, సభ్యులు వేంద్ర మురళీకృష్ణ, వేంద్ర దుర్గాప్రసాద్, సత్యనారాయణ, జుత్తిగ రామకృష్ణ వాసంశెట్టి బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు,

పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

కొరవడిన నిఘా

పిఠాపురం వద్ద చెక్ పోస్ట్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం నానాటికీ తగ్గుతూ వస్తుంది. సిబ్బంది కొరత, ఇతర కారణాల వలన చెక్ పోస్టులపై పర్యవేక్షణ కొరవడం దనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం గతంలో చెక్ పోస్టులపై నిఘా కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసినా సర్కార్ పట్టించుకోవడం లేదు. జిల్లాలో కాకినాడ అర్బన్, కరప, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో 9 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. సామర్లకోట మినహా 16 చోట్ల చెక్ పోస్టులు పని చేస్తున్నాయి.

తనిఖీ కేంద్రాల్లో నిఘా ఏది?

వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు వీటి ద్వారా వెళుతుంటే వాటికి సంబంధించిన మార్కెట్ సెస్ చెల్లించారా లేదా అనేది ఇక్కడ ఉండే సిబ్బంది తనిఖీ చేయాల్సి ఉంది.ఒక వేళ సెస్ తక్కువగా చెల్లించి ఉంటే ఆ వాహనాలను నిలిపి, మిగిలిన మొత్తాన్ని వసూలు చేయాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు తనిఖీల ద్వారా వచ్చే ఆదాయమే చాలా కీలకమైనది. అయితే పలు చోట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కొన్ని చోట్ల పలు వాహనాలను చూసీ చూడనట్టు వదిలేస్తున్నట్లు, మరి కొన్నిచోట్ల వాహనాలను తనిఖీలు చేసినా సొమ్ములకు అలవాటుపడి వదిలేస్తున్నారనే విమర్శలు, మరోవైపు పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు మార్కెట్ కమిటీల అధికారులపై వినిపిస్తున్నాయి.

కార్యరూపం దాల్చని ప్రతిపాదన

వ్యవసాయ మార్కెట్ యార్డులతో పాటు చెక్ పోస్టుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానిక జిల్లా అధికారులు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ప్రభుత్వం కూడా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని భావించింది. అయితే ప్రతిపాదన చేసి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఆచరణ సాధ్యం కాలేదు. కాగా చెక్ పోస్టు వద్ద చెప్పిందే లెక్క అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తే ఏయే వాహనాలు వెళుతున్నాయో, సిబ్బంది డిప్ప పర్యవేక్షణ కూడా చేయొచ్చు. వారు పారదర్శకంగా పని చేసే వీలు ఏర్పడుతుంది. ఏఎంసిలకు ఆదాయాన్ని సమకూర్చే చెక్‌పోస్ట్‌ల నుంచి గతం కంటే ఆదాయం క్రమంగా తగ్గుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు రూ.22 కోట్లు వచ్చింది. వార్షిక లక్ష్యం రూ.30.11 కోట్లు కాగా ఇప్పటి వరకు 9 నెలల కాలంలో కేవలం 58 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలిగారు. ఈ నేపథ్యంలో కెమెరాలను ఏర్పాటు చేస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

కోటలో వందే భారత్ రైలు సందడి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సికింద్రాబాద్ - విశాఖ - సికింద్రాబాద్ ల మధ్య నూతనంగా ప్రవేశపెట్టి ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోటలో సందడి చేసింది. ఆదివారం రాత్రి సామర్లకోట చేరుకున్న రైలుకు మాజీ మంత్రి, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొని స్వాగతం పలికారు. నూతన రైలు ను చూడడానికి జనం అధిక సంఖ్యలో రావడం తో స్టేషన్ కిక్కిరిసి పోయింది. ఎమ్మెల్యే రాజప్ప, టిడిపినాయకులు రైలు ఎక్కి కొంతదూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా నాయకులను స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, కాకినాడ ఏఆర్‌టిఎస్ ఏరియా ఆఫీసర్ డి.వినయ్‌కాంత్, అసిస్టెంట్ డివి జనల్ ఇంజనీర్ బి.శివ ప్రసాద్, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సత్యనారాయణ రాజు, లోవరాజు, రామ సుబ్బారావు, డి సాయి శంకర్, చీఫ్ టికెట్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వి.గిరి, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రైలు లో ఎంఎల్‌ఎ రాజప్పకు స్వాగతం పలికిన రైల్వే అధికారులు

మిస్టర్ ఇండియాగా విజయం సాధించిన రాజేష్

మిస్టర్ ఇండియాగా పెద్దాపురం యువకుడు రాజేష్

ప్రజాశక్తి - పెద్దాపురం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో వెస్ట్ బెంగాల్ బాడీ బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 57 వ జాతీయస్థాయి బాడీ బిల్డింగ్- 2023 పోటీల్లో పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన దేపాటి రాజేష్ 65 కేజీల విభాగంలో మిస్టర్ ఇండియా గా బంగారు పతకం సాధించాడు. అలాగే ఓవరాల్ ఛాంపియన్షిప్ పోటీలో రన్నరప్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పెద్దాపురం ఫేస్‌బుక్ బృంద సభ్యులు పెదిరెడ్డి నరేష్, వంగలపూడి శివకృష్ణ, నవీన్ నాని, సత్య ప్రశాంత్, లక్ష్మణ్ దివాకర్, నెల్లూరి హర్ష రాజేష్ ను అభినందించారు.

కోటనందూరు మండలం ములగపూడి జడ్‌పి స్కూలక్ష కలిసిన పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కోటనందూరు

రౌతులపూడి మండలం ములగపూడి జడ్‌పి హై స్కూల్లో1991 పదవ తరగతి విద్యార్థులు సోమవారం నాడు నాడు పూర్వ విద్యార్థుల అపు రూప ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలనాటి బాల్య స్నేహితులను కలుసుకోవడం మధురానుభూతినిచ్చిందని ఎల్ఐసి ఉద్యోగ సంఘాల యూనియన్ నాయకులు కెఎన్‌వి సత్యనారాయణ అన్నారు. కాలంతో పాటు పరుగులెడుతున్న తరుణంలో ఉద్యోగం వ్యాపారం వ్యవసాయము మరియు ఇతర రంగాలలో జీవనం సాగిస్తున్నాము. చిన్ననాటి స్నేహితులు అందరమూ కలుసుకోవడం ఆనందం ఇచ్చిందని అన్నారు. చదివిన పాఠశాలను చూసి ఆ యొక్క జ్ఞాపకాలను స్మరించుకుంటూ సంతోషాల్లో మునిగి తేలారు. కార్యక్రమంలో అయితా నాగేశ్వరరావు, పంపనా శ్రీనివాసరావు, ఆర్. వీర వెంకట సత్యనారాయణ, ఎరకయ్య కాపు, ఈగల రమేష్, పాలమూరు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుంకటరేవు డే అండ్ నైట్ కబడ్డీ పోటీల జట్లతో రైజింగ్ స్టార్స్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు

కబడ్డీ పోటీల విజేత రామన్నపాలెం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు గ్రామంలో రైజింగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో రామన్నపాలెం జట్టు విజేతగా నిలి చింది. ద్వితీయ స్థానాన్ని శ్రీ మహాలక్ష్మి టీం కైవసం చేసుకుంది. మూడో స్థానంలో సుంకట రేవు, నాలుగో స్థానంలో పెదవలసల నిలిచింది. జిల్లా స్థాయి పోటీల్లో భాగంగా ఉత్కంఠగా జరిగిన ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొనగా రెండు రోజులు పాటు డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలేకురు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, స్థానిక రైజింగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు పవన్, రాజేశ్వరి, తనూజ్, కాకినాడకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోటీలు నిర్వహించారు.

కురుక్షేత్ర నాటకంలో ఓ సన్నివేశం

కళ్లకు కట్టిన 'కురుక్షేత్రం'

ప్రజాశక్తి -ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో 86వ గౌరీ శంకర వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన కురుక్షేత్రం పౌరాణిక నాటకం పలువురిని అలరించింది. తొలుత ధర్మవరం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూ గించాయి. కురుక్షేత్రం నాటకంలో ఒకటో కృష్ణునిగా కిలారి లక్ష్మి, రెండో కృష్ణునిగా ఎ.కోటేశ్వరరావు, దుర్యోధనునిగా ఆసంట బాలాజీ నాయుడు, కర్ణునిగా డి.ఎస్.పి.రావు, ధర్మరాజుగా బలిజేపల్లి అంజిరెడ్డి, భీమునిగా ఆచారి, దృతరాష్ట్రునిగా జీవి రామరాజు, సహదేవునిగా మార్కండేయులు నటించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. ఎవరికీ అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు నాటకాన్ని ఆద్యంతం వీక్షించారు.

తాళ్లరేవులో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కుడిపూడి శివన్నారాయణ

కాజులూరు మండలం అయితపూడిలో చీరలు పంచి పెడుతున్న కొల్లు వెంకటేశ్వరరావు

ప్రతి ఇంటా పండుగే..

1000 మందికి కుడుపూడి చీరలు పంపిణీ

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని వెయ్యి మంది నిరుపేదలకు, వృద్ధులకు ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ స్వగృహంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందరికీ భోజనాలు ఏర్పాటు చేసి అనంతరం చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, పి.మల్లవరం ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపిటిసి దున్న రాంబాబు, మందపల్లి నాగమ్మ, దడాల సువర్ణలత, ఆనాల భాస్కర్, బల్ల బేబీ, మట్టపర్తి తులసి, కావూరి బుజ్జి,బల్ల ప్రసాద్, గుత్తుల రాము, శీలం శ్రీనివాస్, కుడుపూడి శ్రీనివాస్, శివన్నారా యణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

600 మందికి దుస్తులు పంపిణీ

కాజులూరు ప్రతి పేద ప్రజల గహంలో సంక్రాంతి పండగ జరుపుకోవాలని కొల్లు వెంకన్న ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ అధ్యక్షులు కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండగ ప్రతి పేద ప్రజల గహంలో జరుపుకోవాలని గ్రామంలో 600 మంది వద్దులకు దుప్పట్లు చీరలు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సంద ర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటేశ్వం రావు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ప్రజలు కూడా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని లక్ష్యంతో గ్రామంలో ఉన్న పేద ప్రజలందరికీ చీరలు దుప్పట్లు పంచిపెడు తున్నామ న్నారు. కార్యక్రమంలో కొల్లు వరలక్ష్మి, రవితేజ, వెంకట చైతన్య కష్ణ, శృతి, వేద, పంపన వెంకటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

సామర్లకోట రూరల్ సంక్రాంతి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ ఏటా మాదిరిగా స్థానిక ఉప్పు సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పేదలకు నిర్వాహకులు వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది పేదలకు వస్త్ర దానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పు కోదండ రామయ్య, ట్రస్ట్ కుటుంబ సభ్యులు, లబ్ధి దారులు పాల్గొన్నారు.

సామర్లకోటలో ఉప్పు వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం

మద్యం స్వాధీనం : యువకుడు పరార్

ప్రజాశక్తి - కాజులూరు

యానం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తాళ్లరేవు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. వెంకట భవాని తెలిపారు. సోమవారం కాజులూరు మండలం గోప్పిరేవు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా యానం నుండి 70 బాటిల్లను స్ప్లెండర్ మోటార్ సైకిల్‌పై తీసుకొస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నామని గ్రహించి మోటార్‌బైక్‌ను, బాటిళ్లను వదిలి యువకుడు పరారైనట్లు ఆమె తెలిపారు. వాహన నెంబరు ఆధారంగా యువకుడిని పట్టుకుంటామని ఆమె తెలియ జేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

Before The Deputy Registrar of Chits /Arbitrator :: Kakinada (Application for reference of a Dispute to Arbitration)
A.A.C.F.No. 302 of 2021

Between:
Peddapuram Syndicate Chits Private Limited, Peddapuram (Regd No. U65992 AP 2019 PTC 065377) rep by its Managing Director /Foreman Sri Chavali Sri Rama Krishna of Peddapuram
...Petitioner /Disputant
AND
Kallakuri Satyananda Murthy and three others ***...Opponents***
1) Kallakuri Satyananda Murthy, S/o. Bhogaraju, aged 40 Years, Business, D.No. 2-8-12/5, Ramaraopeta, Peddapuram.
2) Kallakuri Lakshmi Santhoshi, W/o. Satyananda Murthy, aged 35Years, Housewife, D.No. 2-8-12/5, Ramaraopeta, Peddapuram.

పై నెంబరు దావాలో డిస్పూటంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ రూ.38,763/-లు కొరకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో అప్పొనెంట్స్ నెం. 1 మరియు 2 అయిన మీ యొక్క హాజరు నిమిత్తం ది.24-01-2023వ తేదీన వాయిదా అయియున్నది. పై నెంబరు దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల సదరు తేదీ అనగా **ది.24-01-2023వ తేదీన ఉదయం గం|| 11:00 ని||లకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు, కాకినాడ వారి ఎదుట హాజరు అయ్యి తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరు.

(By Order of Deputy Registrar of Chits)
Kakinada, **Dy.REGISTARR OF CHITS**
16-1-23. Kakinada

దర్శనానికి వచ్చిన ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు తదితరులు

గనిపోతురాజుకు ఎంఎల్‌సి తోట పూజలు

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండలంలోని కేశవరం గ్రామంలో గని పోతురాజు స్వామిని ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం జరగనున్న తీర్థ మహోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం దేవస్థానం, వైసిపి కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్లను ఎమ్ఎల్‌సి తోట ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వుండమట్ల శ్రీనివాసు, మండల ఆర్‌బికె ఛైర్మన్ అన్నందేవుల చంద్రరావు, తుపాకుల ప్రసన్నకుమార్, ఆలయ ఇఒ అన్నందేవుల శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించగా రూరల్ ఎస్ఐ బళ్ల శివ కష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగిసిన కోడి పందేలు

ప్రజాశక్తి -కాట్రేనికోన

కాట్రేనికోన మండలంలో చెయ్యేరు, గెద్దనపల్లి, మొక్కల తిప్ప, వేట్లపాలెం, లైట్ హౌస్ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు సాంప్రదాయ కోడి పందేలు జరిగాయి. ముమ్మిడివరం సిఐ జానకిరామ్ ఆదేశాల మేరకు కాట్రేనికోన ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రశాంతంగా ముగిశాయి. చివరి వరకూ గుండాట, పేకాటలకు అవకాశం కల్పించకుండా పోలీసులు ఉక్కుపాదం మోపారు. దీంతో నిర్వాహకుల ఆశలు అడి ఆశలయ్యాయి. కోడి పందేల కంటే వాటి అనుసరించి నిర్వహించే గుండాటలకే అధిక ఆదాయం వస్తుందని భావించిన నిర్వాహకుల నిరాశమిగిలింది. ఈ సంక్రాంతికి నిర్వహించిన కోడిపందేలు ప్రశాంతంగా ముగియటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఫోటో ఉంది వాడగలరు.

జూదాలు నిర్వహిస్తున్న 16 మంది అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సంక్రాంతి పండగని పురస్కరించుకుని మండల పరిధిలో కోడిపందేలు, గుండాట నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న బరుల వద్ద కేసులు నమోదు చేసి 13 మందిని, రెండు గుండాట బోర్డులపై కేసును నమోదు చేసి మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

రూ. 5 లక్షలు అందజేస్తున్న కొత్తపేట ఎమ్ఎల్‌ఎ చిర్ల

తెప్ప ఉత్సవానికి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి తెప్పోత్సవం శని, ఆదివారాలో ప్రధాన అర్చకులు ముకుందేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తపేట ఎమ్ఎల్‌ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గి రెడ్డి ప్రతి ఏటా జరిగే అయ్యప్ప స్వామి మకర జ్యోతి దర్శనం, తెప్పోత్సవం వేడుకలు శాశ్వతంగా జరిపించాలని రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. మండపేట ఎమ్ఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావులు స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని కరిచర్లగూడెం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మతి చెందినట్లు గోపాలపురం ఎస్ఐ కె.రామకష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన జి.శ్రీనివాస్(42) ఆటో నడుపుతూ ఉంటాడు. అయితే ఆదివారం సాయంత్రం ఆటో మీద జగన్నాథపురం గ్రామానికి శవపేటిక తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న సమయంలో ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే సమయంలో ఆటో బోల్తా పడింది. ఆ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అత్యవసర వాహనంలో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో బహిర్భూమికి అని వాహనం దిగి ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే మతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుని హత్య

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరం గ్రామం లోని మురళీకృష్ణ థియేటర సమీపంలో కంచర లైన్‌కు చెందిన అండబోయిన రాజేష్(28)ను సోమవారం హత్యకు గురయ్యాడు. సిఐ కె.మంగాదేవి తెలిపిన వివరాల మేరకు అండబోయిన రాజేష్‌ను ఓ మైనర్ పదునైన చాకుతో రెండు సార్లు బలంగా పొడిచి పారిపోయాడని తెలపారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అంబులెన్స్‌కు సమచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చేసరికే పరిస్థితి విషమించడంతో రాజేష్ మృతి చెందాడు. మైనర్ వివరాలు సేకరించామని, అతని కోసం గాలిస్తున్నామని సిఐ తెలిపారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

అండబోయినరాజేష్(ఫైల్)

శిథిలావస్థకు ఆలమూరు సబ్‌జైల్

శిథిలావస్థకు చేరిన సబ్ జైలు ప్రధాన గేటు

ప్రజాశక్తి - ఆలమూరు

ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటైన ఈ ఆలమూరు సబ్ జైలు దాని ప్రహరి, ప్రధాన గేట్లు ఆలనా పాలనా లేక నాటి వైభవాన్ని కోల్పోయి శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు జైలు ప్రాంగణంలో తుప్పలు పెరిగి పాములకు, వివిధ రకాల కీటకాదులకు నిలయంగా మారి దరి చేరాలంటే భయపడి పోతున్నారు. ఈ సబ్ జైల్ ప్రాంతంలో సాయంత్రం అయితే చుట్టుపక్కల విధులు నిర్వహించే ఉద్యోగులు సైతం రహదారి వెంట వెళ్లేందుకు బెంబేలెత్తిపోతున్నారు.

కొంతమంది న్యాయవాదులు ముందుకు వచ్చి గత టిడిపి ప్రభుత్వ హయాంలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన అప్పటి హోమ్ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పునరుద్ధరణకు వినతి కూడా అందజేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారాయి గాని ఎటు వంటి చర్యలు చేపట్టలేదని న్యాయవాదులు అంటున్నారు. స్థానికంగా కోర్టులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో సబ్ జైలు ఉండటం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అంతేకాకుండా నిందితులకు సమయానికి కస్టడీకి తీసుకోవడంలోనూ, బెయిల్ మంజూరు చేసిన తర్వాత సమయానికి రిలీజ్ చేయడానికి ఎంతో అనుకూలమం. ఆలమూరు న్యాయవాదుల అభిప్రాయ వెల్లడిలో మాత్రం స్థానికంగా జైలు అందుబాటులో ఉంటే కోర్టు సమయానికి నిందితులను వేగంగా ప్రొడ్యూస్ చేయడానికి ఎంతో అనువుగా ఉంటుందని న్యాయవాదుల అభిప్రాయం. ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు సబ్ జైల్ తమకు గతంలో ఎంతగానో విశిష్ట సేవలను అందించిందన్నారు. ఇప్పటికయినా సబ్ జైల్ మీద సంబంధిత అధికారులు దష్టి సారించి, జైలు పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా చొరవ తీసుకోవాలని ఆలమూరు వాసులు కోరుతున్నారు.

భారీ వృక్షాలతో సబ్ జైలు

Before The Deputy Registrar of Chits /Arbitrator :: Kakinada (Application for reference of a Dispute to Arbitration)
A.A.C.F.No. 300 of 2021

Between:
Peddapuram Syndicate Chits Private Limited, Peddapuram (Regd No. U65992 AP 2019 PTC 065377) rep by its Managing Director /Foreman Sri Chavali Sri Rama Krishna of Peddapuram
...Petitioner /Disputant
AND
Kallakuri Satyananda Murthy and three others ***...Opponents***
1) Kallakuri Satyananda Murthy, S/o. Bhogaraju, aged 40 Years, Business, D.No. 2-8-12/5, Ramaraopeta, Peddapuram.
2) Kallakuri Lakshmi Santhoshi, W/o. Satyananda Murthy, aged 35Years, Housewife, D.No. 2-8-12/5, Ramaraopeta, Peddapuram.

పై నెంబరు దావాలో డిస్పూటంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ రూ.33,902/-లు కొరకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో అప్పొనెంట్స్ నెం. 1 మరియు 2 అయిన మీ యొక్క హాజరు నిమిత్తం ది.24-01-2023వ తేదీన వాయిదా అయియున్నది. పై నెంబరు దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల సదరు తేదీ అనగా **ది.24-01-2023వ తేదీన ఉదయం గం|| 11:00 ని||లకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు, కాకినాడ వారి ఎదుట హాజరు అయ్యి తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరు.

(By Order of Deputy Registrar of Chits)
Kakinada, **Dy.REGISTARR OF CHITS**
16-1-23. Kakinada

Before The Deputy Registrar of Chits /Arbitrator :: Kakinada (Application for reference of a Dispute to Arbitration)
A.A.C.F.No. 299 of 2021

Between:
Peddapuram Syndicate Chits Private Limited, Peddapuram (Regd No. U65992 AP 2019 PTC 065377) rep by its Managing Director /Foreman Sri Chavali Sri Rama Krishna of Peddapuram
...Petitioner /Disputant
AND
Kallakuri Satyananda Murthy and three others
...Opponents
1) Kallakuri Satyananda Murthy, S/o. Bhogaraju, aged 40 Years, Business, D.No. 2-8-12/5, Ramaraopeta, Peddapuram.

పై నెంబరు దావాలో డిస్పూటంట్ కంపెనీ వారికి రావలసిన బాకీ రూ.2,98,309/-లు కొరకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో అప్పొనెంట్స్ నెం. 1 అయిన మీ యొక్క హాజరు నిమిత్తం ది.24-01-2023వ తేదీన వాయిదా అయియున్నది. పై నెంబరు దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల సదరు తేదీ అనగా **ది.24-01-2023వ తేదీన ఉదయం గం|| 11:00 ని||లకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు, కాకినాడ వారి ఎదుట హాజరు అయ్యి తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరు.

(By Order of Deputy Registrar of Chits)
Kakinada, **Dy.REGISTARR OF CHITS**
16-1-23. Kakinada